క్లుప్తంగా

ఉచితంగా కంటి పరీక్షలు




మాచర్ల: మీనాక్షి కంటి ఆసుపత్రిలో గ్లకోమా వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ప్రజలకు గ్లకోమాపై అవగాహన కల్పించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆసుపత్రి చైర్మన్ చిరుమామిళ్ల కిష్టయ్య మాట్లాడుతూ 40ఏళ్ల పైబడిన వారిలో నీటి కాసులు వచ్చే అవకాశం ఉందన్నారు. డాక్టర్ యశ్వంత్ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



మాచర్ల: మాచర్ల పట్టణాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు పేర్కొన్నారు. పట్టణంలో శనివారం పురపాలక సంఘం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత ర్యాలీ నిర్వహించారు. వారు ట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పురపాలక సంఘ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా, ఏఈ గౌతమి, శ్రీనివాస్, రోటరీ క్లబ్ సభ్యులు ప్రసాద్, ప్రతిభ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణ, మెప్మా ప్రాజెక్టు అధికారులు, ఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తాయి తోట దగ్ధం



విజయపురిసౌత్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో బత్తాయి తోట దగ్ధమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాచర్ల మండలం చింతల తండాకు చెందిన రైతు అంగోత్ మోతిలాల్ తన 4 ఎకరాల్లో 2018 నుంచి బత్తాయి తోట వేసి సాగు చేసుకుంటున్నాడు. ఈ నెల 9న మోటార్ బోర్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి బత్తాయి తోట కు అంటుకున్నాయని వివరించారు. హుటా హుటిన స్థానికులతో కలిసి నీళ్లు చల్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా..ఎకరం వరకు బత్తాయి తోట పూర్తిగా దగ్ధమైందని రైతు అంగోత్ మోతిలాల్ నాయక్ తెలిపారు. మూడు లక్షల రూపాయల నష్టం జరిగిందని బాధితుడు పేర్కొన్నారు.

మట్టి ఖర్చులు అందజేత



రెంటచింతల: మండల కేంద్రంలోని పరిశుద్ధ్య కార్మికుడు దాకూరి ఆదాం(54) మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, మూలి రాయపరెడ్డి, ఓరుగంటి ఇన్నారెడ్డి, పాస్టర్ ఐజాక్, మారాసు శ్రీను, మర్రి రాజ్‌కుమార్, సిల్వరాజు, మామిడి సామేలు ఉన్నారు.

ప్రజాదర్బార్‌కు 50 దరఖాస్తులు



వెల్దుర్తి: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు 50 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అన్నీ సంక్షేమ పథకాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. పెన్షన్‌లు, ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలు మంజూరుకు దరఖాస్తులు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం త్వరలోనే పేద ప్రజలకు అన్నీ రకాల సంక్షేమ పథకాలను మంజూరు చేస్తుందన్నారు. వివిధ అంశాల పై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

88త్యాళ్లూరు(క్రోసూరు) : మండలంలోని 88త్యాళ్లూరు గ్రామంలోని లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల తిరునాళ్ల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉయ్యందన, చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అశేషంగా పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం తిరునాళ్ల సందర్భంగా పెద్ద ఎత్తున్న సంబరాలు, అంగళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభలు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త అత్తోట శ్రీనివాసరావు తిరునాళ్ల మహోత్సవాన్ని పర్యవేక్షించారు. అర్చకులు హనుమంతరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠాలు చెప్పిన చోటే.. పాడు పనులు

- చిన్నబోతున్న చిన్న హైస్కూల్
- రూ.కోట్ల విలువైన ఆస్తులకు రక్షణ కరువు
- పాఠశాల స్థలం ఆక్రమణకు ప్రణాళికలు
- నిర్వహణలోపంతో అసాంఘిక కార్యక్రమాలకు నెలవు



కనీసం తలుపులు కూడా వేయకుండా గాలికి వదిలేసిన పాఠశాల భవనం



తరగతి గదిలో తాగి పడేసిని గ్లాసులు, సీసాలు



తలుపులు విరగొట్టబడి పాడైపోతున్న భవనం

కారెంపూడి: జిల్లా పరిషత్‌కు చెందిన కోట్లాది రూపాయల విలువైన స్థలం, అందులో ఉన్న భవనాలు నిర్వహణ లోపంతో పాడైపోతున్నాయి. దీంతో అవి అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఎంతగా అంటే ఒకప్పుడు పాఠాలు చెప్పిన గదుల్లోనే ఇప్పుడు మూత్ర విసర్జనకు ఉపయోగిస్తున్నారు. ఇది ఊరి చివర్లో కాదు. గ్రామ నడిబొడ్డులో జరుగుతోంది. స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల రెండు బ్లాకులుగా ఉండేది. వాటిని పెద్ద హైస్కూలు, చిన్న హైస్కూలని పిలిచేవారు. అప్పట్లో చిన్న హైస్కూల్లో 6, 7 తరగతులు నడిచేవి. పెద్ద హైస్కూల్ ప్రాంగణంలో తగిన వసతి సమకూరడంతో తర్వాత కాలంలో చిన్న హైస్కూలు నిరుపయోగంగా మారింది. దానిని కొన్నేళ్లు జెడ్పీ ప్రైవేటు జూనియర్ కాలేజీకి, ఆ తర్వాత ప్రైవేటు స్కూల్‌కి అద్దెకిచ్చింది. అవి నడిచేటప్పుడు భవనాల పరిరక్షణతో పాటు ప్రభుత్వానికి ఎంతోకొంత ఆదాయం కూడా సమకూరింది. ప్రైవేటు స్కూలును కొన్ని నెలల క్రితం ఖాళీ చేయించడంతో ఇక ఆ స్థలం భవనాలకు సంరక్షణ కరువైంది. దీంతో రెండు బ్లాకులుగా ఉన్న పాఠశాల భవనాలలో నేడు కాలు పెట్టడానికి కూడా వీల్లేకుండా తయారైంది. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

రక్షణ కరువైంది...

ఇక్కడ సెంటు స్థలం రూ.20 లక్షల దాకా ఉంది. ఈ లెక్కన రూ.30 కోట్ల పైనే విలువైన స్థలం అది. ఈ స్థలాన్ని స్వాహా చేయాలని కబ్జా కోరులు రకరకాల ప్రయత్నాలు చేశారని తెలుస్తోంది. ఈ స్థలాన్ని గ్రామానికి చెందిన కిల్లా, బొమ్మిన వంశాలకు చెందిన కుటుంబాలు పాఠశాల ఏర్పాటుకు 1949లో స్థలాన్ని దానం చేశాయి. మద్రాసు గవర్నమెంటు బోర్డు హైస్కూలును ఇక్కడ ఏర్పాటు చేసింది. అనేక దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేశారు.

1987లో సమితి నిధులకు తోడుగా అప్పటి సర్పంచ్ యడ్ల రామయ్య గ్రామస్తుల సహకారంతో విశాలమైన బ్లాకును నిర్మించారు. అవి ఘనమైన చరిత్రకు సాక్ష్యంగా కన్పిస్తున్నాయి. ఈ స్థలంలోనే మెయిన్ రోడ్డు పక్కన మండల విద్యా వనరుల కేంద్రం, గ్రామ సచివాలయం 2 భవనాలు నిర్మించారు. ఎంఈఓ ఆఫీసుకు ప్రధాన రహదారి గుండా దారి పెట్టుకున్నారు. గ్రామ సచివాలయానికి అలా లేకపోవడంతో.. ఇదే కాంపౌండులో ఉండడంతో ఆ కార్యాలయానికి ప్రజలు కూడా రాలేని పరిస్థితి ఏర్పడింది. ఈ భవనాన్ని ప్రజా అవసరాల కోసం వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

దుస్థితిపై జెడ్పీ సీఈఓకు లేఖ రాస్తా..

సమస్యను వివరిస్తూ జిల్లా పరిషత్తు సీఈఓకు లేఖ రాస్తాను. ఇలాంటి పరిస్థితి వల్ల గ్రామ సచివాలయం 2 నిర్వహణకు కూడా ఇబ్బందిగా ఉంది. మెయిన్ రోడ్డుకు ద్వారం పెట్టుకోవాల్సిన పరిస్థితి కన్పిస్తోంది. భవనాలు పాడైపోతుండడంతో పాటు ప్రాంగణం కూడా ఇబ్బందికరంగా తయారైంది.

– జి.శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ, కారెంపూడి

అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి

చదువు కోసం గ్రామస్తులు దానం చేసిన స్థలాన్ని పరిరక్షించలేకపోవడం బాధాకరం. రైతులు ఎడ్ల బండ్లతో రాళ్లు తోలి పాఠశాల బ్లాకు నిర్మాణానికి చేయూత నిచ్చారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. గ్రామస్తుల, ఉమ్మడి సౌకర్యాలు, ఉమ్మడి ప్రయోజనాల కోసం స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– యడ్ల రామకృష్ణారావు, విశ్రాంత డీఈ, కారెంపూడి

వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ డాక్టర్స్ వింగ్ అధికార ప్రతినిధిగా డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, నర్సరావుపేట పార్లమెంట్ ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టేందుకు తన వంతు కృషి తప్పకుండా చేస్తానని, ధీమా వ్యక్తం చేశారు.

దేవరంపాడుకు వైఎస్సార్ సీపీ ప్రభ



పిడుగురాళ్ల: రాజుపాలెం మండలంలోని దేవరంపాడు వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల మూడవ శనివారం ఘనంగా జరిగాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలిన కొంత మంది ప్రభను ఏర్పాటు చేసుకొని తీసుకెళ్లారు. ఈ ప్రభ తిరునాళ్లకు వచ్చిన భక్తులను ఆకర్షించింది.

అయోడిన్ తగ్గితే ఆరోగ్యానికి ముప్పు



విద్యార్థినులకు అయోడిన్ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

రెంటచింతల: అయోడిన్ ఉన్న ఉప్పును మాత్రమే వాడాలని, అయోడిన్ తగ్గితే మన ఆరోగ్యానికి ముప్పు తప్పదని గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి. ప్రదీప్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం అయోడిన్ సర్వేలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అలాగే ఆంజనేయ స్వామి మాణ్యం కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. అయోడిన్ లోపం ఉన్న జీవక్రియ మందగిస్తుందని, దీని వల్ల అలసట, బలహీనత, అసహనం, బరువు పెరగడం, వంటి సమస్యలు వస్తాయన్నారు. పాఠశాలలో 9 మంది విద్యార్థులకు అయోడిన్ లోపం ఉన్నట్లు గుర్తించారు. మూత్రం శాంపిల్స్ పరీక్షల కోసం జిల్లా ల్యాబ్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఎస్. కోటేశ్వరరావు, సీహెచ్‌ఓలు ఆర్. మౌనిక, ఎం.మేరి ప్రశాంతి, ఏఎన్‌ఎంలు జి.మార్తమ్మ, ఎ. సౌభాగ్యవతి, హెల్త్ అసిస్టెంట్స్ మహేష్‌బాబు, ఖాసిం, ఆశలు పాల్గొన్నారు.

నాణ్యమైన వస్తువు వినియోగదారుని హక్కు



ర్యాలీ నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పిడుగురాళ్ల: పట్టణంలో శనివారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో ప్రజలకు హక్కులపై అవగాహన కల్పించారు. సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు వినియోగదారులేనని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువు నాణ్యతను పరిశీలించాలని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక 25వ వార్డులో ర్యాలీ నిర్వహించారు. డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై ఆసక్తి కలిగి ఉండాలి



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న శివనాగేశ్వరరావు

సత్తెనపల్లి: విద్యార్థులు చిన్నతనం నుంచే చదువు పట్ల ఆసక్తిని కలిగి సమయపాలన పాటిస్తూ ముందుకు సాగాలని పల్నాడు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి శివ నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులకు హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల సహకారంతో శనివారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల అభివృద్ధికి సంక్షేమ పథకాల ద్వారా పాటుపడుతున్నాయన్నారు. బీసీ బాలుర వసతి గృహం సంరక్షణ అధికారి రత్నబాబు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ హెల్ప్ ఫౌండేషన్ దాతల సహాయంతో 12 పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేయడం జరిగిందన్నారు. టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ బాబు మాట్లాడుతూ మంచి నడవడిక, చదువు పట్ల ఆసక్తి ఉన్నప్పుడే ప్రతి విద్యార్థి విజయాలను సాధించగలడన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సురేష్, అంజి, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజనులకు అధికారం.. కాన్షీరాం ఘనత



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: ఓట్లు మావే సీట్లు మావే అనే నినాదంతో బహుజనులను అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత కాన్షీరాంకే దక్కిందని బీసీ సంఘం నాయకులు అన్నారు. పట్టణంలోని ఎన్జీవో హోం సెంటర్‌లో బీసీ సంఘ నాయకుడు, మాజీ కౌన్సిలర్ పులహరి బానోజీ ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షీరాం జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ కుల వ్యవస్థను అంతం చేయాలనే కోరికతో నడిచిన నాయకుడని, అణచివేతకు గురవుతున్న వారిని మాట్లాడటానికి, ఇతరుల హక్కుల కోసం పోరాడటానికి అనుమతించే వేదికను కాన్షీరాం సృష్టించాడన్నారు. కేంద్రంలో వీపీ సింగ్ ప్రభుత్వానికి ఓబీసీలకు 40 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని లేకుంటే కుర్చీ నుంచి దిగిపోవాలని ఢిల్లీలో 42 రోజులు పాటు బోటు క్లబ్ వద్ద దీక్ష చేసిన బహుజన నేత కాన్షీరాం అని కొనియాడారు. కాన్షీరాం తన జీవితాన్ని వెనుకబడిన తరగతులను అధికారంలోకి తీసుకురావడానికి అంకితం చేశారన్నారు. ఒక ఓటు ఒక నోటు నినాదంతో ప్రజల దగ్గరికి వెళ్లి వారి డబ్బుతోనే ప్రచారం చేసిన గొప్ప నాయకుడని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గుంటూరు గోవిందు, చింకా అంకమ్మరావు, బడిగంచుల మస్తాన్‌రావు, పోతుల ప్రకాశరావు, షేక్ చిన్న షరీఫ్, యర్రగొర్ల శ్రీనివాస్, మోదుగుల బాబ్జి, దేవుళ్ళ జగన్నాథం, బొంత కోటయ్య, నామాల అంజి, కొమ్మూరి అశోక్, యుద్దనపూడి శివ నాగ మల్లేశ్వరాచారి, గరికపూడి బెన్నిబాబు, చింతపల్లి లాజరు తదితరులు ఉన్నారు.

ముగిసిన ఇంటర్మీడియెట్ పరీక్షలు

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఆఖరి రోజు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. పట్టణంలోని మొత్తం ఆరు సెంటర్లలో చివరి రోజు జనరల్ విభాగంలో 1,152 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,045 మంది హాజరయ్యారు. 107 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌లో 26 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 20 మంది హాజరుకాగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్క్వాడ్ బృందాలు పలు పరీక్ష కేంద్రాలను సందర్శించాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయి.

స్వచ్ఛాంధ్ర కోసం కృషి చేస్తాం



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న దాచేపల్లి కమిషనర్ అప్పారావు

దాచేపల్లి: స్వచ్ఛ ఆంధ్ర కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ కేవీ కుటుంబరావు అన్నారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం పరిసరాలను పరిశుభ్రం చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో కమిషనర్ వైవీ అప్పారావు ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో పప్పుల రత్నం విద్యార్థులు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం, రెంటాల గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అధికారులు సిబ్బందితో కలసి పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు.

కారెంపూడి: మండలంలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను ఊడ్చి శుభ్రం చేశారు. విద్యార్థులతో అవగాహన కల్పిస్తూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి బూసిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కారెంపూడి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మరుగుదొడ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి నిర్మాణ పనులు చేపట్టేందుకు వెంటనే మార్కింగ్ ఇవ్వాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఈఓపీఆర్డీ కసిన్యానాయక్, ఏపీఏ కోటిరెడ్డి పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం రమ్య స్థానిక మెయిన్ స్కూల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అయోడైజ్డ్ సాల్ట్ వాడాలని అయోడిన్ కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రమ్య కోరారు.

వెల్దుర్తి: శిరిగిరిపాడు గ్రామంలో శనివారం మండల ప్రత్యేకాధికారి జగదీశ్వరరెడ్డి, అధికారుల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామంలో పర్యటించి మురుగు, చెత్త కుప్పలను తొలగించి, తాగునీటి వనరులను పరిశీలించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులతో స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

విజయపురిసౌత్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నాగార్జున సాగర్ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక వాటర్ సప్లయ్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. ఉద్యోగులతో పాటు నాయకులు చీపురులను చేతబట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్థానిక ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్క్, టీడీపీ నాయకుడు ఘంటా ధనుంజయరావు, ఉద్యోగులు వెంకటేశ్వర్లు, తుమ్మనాధం, జయరావు పాల్గొన్నారు.

గురజాల రూరల్ : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ షేక్ గౌసియా భేగం అన్నారు. మండల పరిధిలోని పల్లెగుంత గ్రామంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ సెక్రటరీ లక్ష్మానాయక్, సలీం బాష ఉన్నారు.



చీపుర్లు పట్టిన సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, అధికారులు

పిడుగురాళ్లరూరల్: గ్రామాల్లో స్వచ్ఛతే లక్ష్యంగా పని చేయాలని మండల ప్రత్యేకాధికారి ఆంజనేయులు అన్నారు. కాలేపల్లి గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండల, గ్రామ స్థాయి అధికారులు కలిసి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. చెత్త కేంద్రాన్ని సందర్శించారు. ఈవోపీఆర్డీ దయాసాగర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సర్పంచ్ శివయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



శిరిగిరిపాడులో స్వచ్ఛాంధ్ర ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, ఎంపీడీఓ గౌసియా భేగం



ఎరువును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి, అధికారులు

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

హసనాబాద్(క్రోసూరు): ఎన్ఆర్ఐ భానుప్రకాశ్ సహకారంతో మాగులూరి ఫౌండేషన్ ద్వారా మండలంలోని హసనాబాద్ గ్రామంలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష సామగ్రి అందించినట్లు పాఠశాల హెచ్ఎం వై.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు స్కేల్, పెన్సిల్, పెన్, ప్యాడ్ తదితర పరీక్ష సామగ్రి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం సహించేది లేదు



దుకాణ యజమానులకు కమిషనర్ శ్రీధర్ అవగాహన

పిడుగురాళ్ల: ప్లాస్టిక్ వాడితే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని వ్యాపార సముదాయాలలో శనివారం ఆయన తనిఖీలు చేపట్టారు. దుకాణదారులందరికీ ప్లాస్టిక్ వాడవద్దని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్లాస్టిక్ వాడటం వల్ల ఎన్నో అనర్థాలు వస్తాయన్నారు. వాటిని గుర్తించి అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న మాచర్ల ఫైర్ ఆఫీసర్ సునీల్ కుమార్

సత్రశాల(రెంటచింతల): వేసవిలో తరచూ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని మాచర్ల ఫైర్ ఆఫీసర్ సునీల్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణకు తగు సూచనలు, సలహాలతో పాటు ఎటువంటి అగ్ని ప్రమాదానికి ఏఏ పరికరాలను ఉపయోగించాలో మాక్ డ్రిల్ ద్వారా చూపించి వివరించారు. ప్లాంట్ హెడ్ ఎంఎస్ఎన్ రాజు, ఫ్యాక్టరీ అధికారి జి.మల్లికార్జునరావు, సేఫ్టీ మేనేజర్ కె.జగదీష్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.